సాక్షి
ములుగు

గురువారం ၊ 28 ၊ మార్చి ၊ 2024



బడికిపోయినా బతికెటోడు..

ఎండుమిర్చిని విక్రయించేందుకు తండ్రితో కలిసి వెళ్లిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.

- 8లో▸



అమరుల త్యాగ ఫలితమే పోడు వ్యవసాయం

- 8లో▸

అమరుల త్యాగ ఫలితంగానే నేడు పోడు వ్యవసాయం చేసుకుంటున్నామని మంత్రి సీతక్క అన్నారు.

గరిష్టం/కనిష్టం
$40^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

నేడు మేడారంలో హుండీల లెక్కింపు

ఎస్‌ఎస్ తాడ్వాయి: మేడారంలోని సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హుండీలను నేడు (గురువారం) పూజారుల సమక్షంలో తెరిచి లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ రాజేంద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 10 హుండీల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటల నుంచి చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

భూపాలపల్లి: వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాలో ఏర్పడే ఇబ్బందులను పరిష్కరించేందుకు మున్సిపాలిటీ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో లీకేజీలు, ఇతర సమస్యలు ఏమైనా ఉంటే కంట్రోల్ రూం నంబర్ 8978180036కు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల లోపు ఫోన్ చేసి వివరాలు తెలియజేస్తే సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ వివరించారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



భూపాలపల్లి: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని భూపాలపల్లి మున్సిపాలిటీ కమిషనర్ టి.రాజేశ్వర్ కోరారు. జిల్లా ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా ఆదేశాల మేరకు ఓటుహక్కు వినియోగంపై మెప్మా సిబ్బంది, బూత్ లెవల్ ఆఫీసర్లతో పట్టణ ప్రధాన రహదారిపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలి



మొగుళ్లపల్లి: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వాహనాల తనిఖీలు నిర్వహించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడినా, ఒక వర్గాన్ని, వ్యక్తులను లేదా పార్టీలని రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ఆయన వెంట చిట్యాల సీఐ మల్లేశ్, మొగుళ్లపల్లి ఎస్సై అశోక్, సిబ్బంది ఉన్నారు.


ఉపాధిహామీ పనుల్లో వేగం పెంచాలి

మహాముత్తారం: ఉపాధిహామీ పనుల్లో కూలీలు వంద మందికి తగ్గకుండా పెంచి పనుల్లో వేగం పెంచాలని అదనపు డీఆర్‌డీఓ వసుమతి అన్నారు. మండల పరిధిలోని కొర్లకుంట, మహాముత్తారం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె బుధవారం పరిశీలించారు. కూలీల వద్దకు వెళ్లి ప్రతిఒక్కరూ ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని సూచించారు. మీ గ్రామంలోని పనులు మీరే చేసుకొని వలసలకు తావివ్వకుండా చూసుకోవాలన్నారు. కూలీలకు తాగునీటి సౌకర్యం, నీడ, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచడంతో అధికారులను అభినందించారు. మండలకేంద్రంలో నిర్వహిస్తున్న నర్సరీ పనులను పరిశీలించి నీడనిచ్చే పండ్ల మొక్కలను ఎక్కువ శాతం పెంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉపాధిహామీ సిబ్బంది కూలీలకు బిల్లులు సకాలంలో చెల్లించాలని సూచనలు చేశారు.

పొలిటికల్ హీట్

ఎంపీ ఎన్నికలకు సరికొత్త వ్యూహాలు

- ఆత్మీయ సమ్మేళనాలు, ప్రచార ప్రణాళికలతో హడావిడి
- ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ, బీఆర్‌ఎస్
- కాంగ్రెస్ వరంగల్ అభ్యర్థిపై ఉత్కంఠ.. ఢిల్లీలో ముగిసిన పీఈసీ, సీఈసీ భేటీ
- నేడో, రేపో అభ్యర్థి ప్రకటన
- ఉమ్మడి జిల్లాలో వేడెక్కిన రాజకీయాలు



సాక్షిప్రతినిధి, వరంగల్ :

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. ఉమ్మడి వరంగల్‌లో ప్రధాన పార్టీలు తమ అభ్యర్థుల విజయం కోసం సరికొత్త వ్యూహాలతో ముందుకెళ్తున్నాయి. కొత్త ఒరవడితో ఆత్మీయ సమ్మేళనాలు, ప్రచార ప్రణాళికలను అమలు చేసే పనిలో పోటాపోటీగా వ్యవహరిస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఇప్పటికే.. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి అభ్యర్థులను ప్రకటించాయి. వరంగల్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఖరారు చేయాల్సి ఉంది. మానుకోట నుంచి పోరిక బలరాంనాయక్ (కాంగ్రెస్), మాలోతు కవిత(బీఆర్‌ఎస్), అజ్మీరా సీతారాంనాయక్ (బీజేపీ) తలపడనుండగా.. వరంగల్ కోసం బీజేపీ నుంచి అరూరి రమేశ్, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కడియం కావ్య బరిలో నిలవనున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ కోసం ఆరడజను మంది తీవ్రంగా ప్రయత్నం చేస్తుండగా.. బుధవారం సాయంత్రం ఢిల్లీలో జరిగిన సీఈసీ సమావేశం ముగిసేటప్పటికి దొమ్మాటి సాంబయ్య, సింగపురం ఇందిర, నమిండ్ల శ్రీనివాస్ మధ్య టికెట్ పోటీ ఉన్నట్లు సమాచారం. నేడో, రేపో వరంగల్ అభ్యర్థిని ప్రకటించేందుకు టీపీసీసీ సిద్ధమైనట్లు పార్టీ వర్గాల సమాచారం.

ఎవరి వ్యూహం వారిదే..

వరంగల్, మానుకోట స్థానాల్లో ఎలాగైనా విజయం సాధించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ నాయకులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ప్రజల్లో పలుకుబడి ఉన్న నేతలతో ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. ఇప్పటికే ఎంపీ పసునూరి దయాకర్ తదితరులు పార్టీలో చేరగా.. ఇతర పార్టీల్లోని కీలక నేతలను చేర్చుకోవడం ద్వారా ప్రత్యర్థి పార్టీని బలహీనపరిచే పని మొదలు పెట్టారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ను వీడి ఇతర పార్టీల్లో చేరిన నేతలను తిరిగి రప్పించే ప్రయత్నాలూ మొదలు పెట్టారు. పాలకుర్తి, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను పెద్దఎత్తున చేర్చుకుంటున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో సైతం చేరికలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఉమ్మడి వరంగల్‌లో జాతీయ నాయకులతో బహిరంగ సభలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రణాళికలు.. ఎత్తుగడలు

ఇద్దరు బీఆర్‌ఎస్ కీలక నేతలైన అజ్మీరా సీతారాంనాయక్, అరూరి రమేశ్‌ను పార్టీలో చేర్చుకుని టికెట్ కేటాయించిన బీజేపీ.. ఈసారి ఈ రెండు ఎంపీ సీట్లను కైవసం చేసుకోవడానికి అవసరమైన వ్యూహాన్ని రచిస్తోంది. అభ్యర్థులు క్షేత్రస్థాయిలో పర్యటించి జనం మధ్యే ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. బీఆర్‌ఎస్ ముఖ్య నేతలను పార్టీలోకి ఆహ్వానించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇక బీఆర్‌ఎస్.. రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో పార్టీ కార్యకర్తలు కొంత నిరుత్సాహానికి గురైనా.. లోక్‌సభ ఎన్నికలకు వారిని సన్నద్ధం చేసేందుకు నియోజకవర్గస్థాయి సమావేశాలు నిర్వహిస్తూ మేమున్నామంటూ రాష్ట్ర నాయకత్వం భరోసా ఇస్తోంది. కాన్ఫరెన్స్‌లు, సమీక్షల ద్వారా అలర్ట్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా భేటీలు నిర్వహించారు.

గెలుపే లక్ష్యంగా..

గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు సరికొత్త వ్యూహాలతో ముందుకెళ్తున్నాయి. వరంగల్, మానుకోట లోక్‌సభ స్థానాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముఖ్య నేతలతో సమన్వయ కమిటీలు, మండలాలు, గ్రామాల్లో ఎన్నికల కమిటీలు ఏర్పాటు చేసే పనిలో పడ్డాయి. ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులు, చేపట్టబోయే పనుల గురించి ఓటర్లకు వివరించాలని కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌కు పిలుపునిస్తోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది. ఇక బీజేపీ నేతలు.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రధాని మోదీ అందిస్తున్న సుస్థిర పాలన గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి సూచిస్తోంది. ఇలా ప్రధాన పార్టీల వ్యూహాలతో ఉమ్మడి జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

కామేశ్వరాలయ పనులు ప్రారంభం



కామేశ్వరాలయానికి మార్కింగ్ ఇచ్చి పనులను ప్రారంభిస్తున్న పురావస్తుశాఖాధికారి మల్లేశ్

సాక్షి ఎఫెక్ట్..

వెంకటాపురం(ఎం): కామేశ్వరాలయ పునర్నిర్మాణ పనులు ఎట్టకేలకు బుధవారం ప్రారంభమయ్యాయి. 'ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. 13 ఏళ్లుగా మూలనపడ్డ కామేశ్వరాలయ శిల్పాలు' కథనం సాక్షిలో బుధవారం ప్రచురితం కావడంతో స్పందించిన కేంద్ర పురావస్తుశాఖ ఉన్నతాధికారులు కామేశ్వరాలయ పనులు వెంటనే ప్రారంభించి తమకు ఫొటోలను సాయంత్రంలోగా పంపాలని ఆదేశించడంతో హుటాహుటిన పురావస్తుశాఖ జిల్లా అధికారి మల్లేశ్ రామప్పకు చేరుకొని కామేశ్వరాలయ పునర్నిర్మాణం పనులకు మార్కింగ్ ఇచ్చారు. కామేశ్వరాలయ పునాదిని తొలగించేందుకు సుమారు రెండు మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరిపేందుకు పనులు చేపట్టారు. పునాది స్థాయిలో ఉన్న రెండు లేయర్ల లెవల్స్ తీసుకొని లేయర్స్‌ను (రెండు వరుసలుగా ఉన్న పునాది రాళ్లు) తొలగించనున్నారు. అదేవిధంగా రామప్ప ఆలయానికి కామేశ్వరాలయం, ప్రాకార గోడ ఎంత దూరంలో ఉందనే అంశాలపై డీజీపీఎస్ సర్వే చేసి వివరాలు రికార్డు చేయనున్నట్లు మల్లేశ్ సాక్షికి తెలిపారు. మూడు నెలల్లోగా కామేశ్వరాలయానికి ఫౌండేషన్ వేస్తామని వెల్లడించారు.

క్షయవ్యాధి నివారణ ర్యాలీ

ములుగు: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగులోని జిల్లా ఆస్పత్రి వద్ద క్షయవ్యాధి నివారణ ర్యాలీని జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి నుంచి బస్టాండ్ వరకు క్షయవ్యాధి నివారణపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పయ్య మాట్లాడుతూ క్షయవ్యాధి బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ అని ఇది సాధారణంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుందన్నారు. దగ్గు, తుమ్మడం, ఉమ్మివేయడం ద్వారా గాలిలో కలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షయవ్యాధి ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్, జిల్లా మాస్‌మీడియా ఆఫీసర్ తిరుపతయ్య, డీపీఎం సమ్మయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, శారద, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

హుండీ ఆదాయం రూ.8.73లక్షలు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం హుండీలను లెక్కించగా రూ.8,73,693 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ సత్యనారాయణ తెలిపారు. ఆలయంలో వివిధ ప్రదేశాల్లో మొత్తం 8 హుండీలను ఏర్పాటు చేయగా భక్తులు సమర్పించిన కానుకలను దేవాదాయ ధర్మాదాయ శాఖ పరకాల డివిజన్ అధికారి అనిల్‌కుమార్ పర్యవేక్షణలో లెక్కించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు కైకర్యం రాఘవాచార్యులు, ముక్కాముల శేఖర్‌శర్మ, ఏడునూతుల ఈశ్వర్‌చంద్, కారంపుడి పవన్‌కుమార్ ఆచార్యులు, ఆలయ సీనియర్ అసిస్టెంట్ సీతారామయ్య, సిబ్బంది నూతులకంటి అజయ్, గొర్లపెల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

ముగిసిన కోటంచ బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర దంపతులు



హంస వాహన సేవలో స్వామివారు..

రేగొండ: మండల పరిధిలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నాకబలితో ముగిశాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో స్వామివారికి వేదమంత్రోచ్ఛరణల నడుమ చక్రస్నాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజల నడుమ స్వామివారికి అభిషేకం చేశారు. భక్తుల దర్శనార్థం అలంకరణలు లేకుండా స్వామి వారి నిజరూప దర్శనాన్ని కల్పించారు. పలు రకాల పుష్పాలతో యాగం చేశాక, సాయంత్రం స్వామి వారిని హంసవాహన సేవలో ఆలయ ప్రాంగణం చుట్టూ స్వామి వారిని ఊరేగించారు.

ఆఖరి ఘట్టం నాకబలి

బ్రహ్మోత్సవాల్లో ఆఖరి ఘట్టమైన నాకబలిని అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ సాయంత్రం 7గంటలకు ప్రారంభించారు. అత్యంత వైభవోపేతంగా కొనసాగిన మహోత్సవానికి వేలాది మంది భక్తులు హాజరై నాకబలిని వీక్షించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఇప్పటి వరకు సుమారు 2లక్షలకు పైగా భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పున్నం లక్ష్మి, ఎస్ఎస్ఆర్ సంస్థల అధినేత సంపత్‌రావు, నాయకులు పున్నం రవి, ఆలయ కమిటీ సభ్యులు మల్లెబోయిన శ్రీధర్, మూల ఓంకార్, డోలిలి కోటేశ్వర్‌రావు, కనుకుంట్ల జోగేందర్, పేరాల తిరుపతి, పోలుసాని శ్రీనివాసరావు, లింగంపల్లి తిరుపతిరావు, గ్రామ పెద్దలు కనుకుంట్ల దేవేందర్, ఆలయ సిబ్బంది రవిందర్, శ్రావణ్, సుధాకర్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం



ఈ నెల 19 నుంచి బుధవారం వరకు కొనసాగిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ, గ్రామస్తుల సహకారంతో విజయవంతం చేశాము. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం సకల సౌకర్యాలు కల్పించాము. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది సహాయంతో తగు జాగ్రత్తలు తీసుకున్నాం.

- బిల్లా శ్రీనివాస్, ఆలయ ఈఓ

ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్‌ను సందర్శించిన డైరెక్టర్

భూపాలపల్లి అర్బన్: ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్–2ను బుధవారం సింగరేణి ప్రాజెక్ట్, ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన ఉత్పత్తిని సాధించాలన్నారు. బొగ్గు ఉత్పత్తికి తీసుకుంటున్న చర్యలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీఎం శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.



తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా

ఏటూరునాగారం/వాజేడు/వెంకటాపురం(ఎం): వేసవికాలంలో గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడిని నివారించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. ఎండల తీవ్రత పెరగడంతో వాగులు, గోదావరి నదిలో నీటి నిల్వలు రోజురోజుకూ తగ్గిపోతున్న నేపథ్యంలో ఆయన బుధవారం జిల్లాలోని రాంనగర్, పూసూరు, రామప్పలోని ఇన్‌టేక్ వెల్‌లను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి సందర్శించారు. తొలుత ఆయన ఏటూరునాగారం మండల పరిధిలోని రాంనగర్ ఇన్‌టేక్ వెల్‌ను సందర్శించి మిషన్ భగీరథ ఇంటెక్ వెల్ నుంచి తాగునీరు ఎంత కెపాసిటీలో పంపిణీ చేస్తున్నారు.. అన్ని గ్రామాలకు నీటి పంపిణీ సరిపోతుందా అనే అంశాలను తెలుసుకున్నారు. రాంనగర్ ఇన్‌టేక్‌వెల్ ద్వారా మంగపేట మండలంలోని 57గ్రామాలకు ప్రతిరోజూ మంచినీటిని పంపిణీ చేయాల్సి ఉంటుందని అధికారులు ఆయనకు వెల్లడించారు. అలాగే వాజేడులోని పూసూరు వద్ద ఉన్న పంపుహౌజ్ నుంచి వెంకటాపురం(కె), కన్నాయిగూడెం, వాజేడు, ఏటూరునాగారం, తాడ్వాయిలోని 256 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా రామప్ప పంపుహౌజ్ నుంచి గోవిందరావుపేట, ములుగు, వెంకటాపురం(ఎం) 165 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,346 బోర్‌వెల్స్ ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలాల్లోని అన్ని గ్రామాలకు సరిపడా నీరు సప్లై అవుతుందా లేక ఇంకేమైనా చర్యలు చేపట్టాలా అని అధికారులతో చర్చించారు. అధికారులు ఇన్‌టేక్‌వెల్‌లో ఏమైనా లోపాలు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలుపాలని సూచనలు చేశారు. ప్రతీ గ్రామానికి తాగునీరు పంపిణీ అయ్యేలా సంబంధిత అధికారులు ప్రతిరోజూ గమనించాలన్నారు. గోదావరి నుంచి ప్రతిరోజూ సరిపడా నీరు వస్తుందా లేదా గమనించి దానికి సరిపడా నీరు ఇన్‌టేక్ వెల్ రావడానికి, నీరు నిల్వ ఉండడానికి గోదావరిపై అవసరమైతే ఇసుక కట్టలు వేయాలన్నారు. ఆయా గ్రామాల ప్రజలు నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలన్నారు. కలెక్టర్, ఇతర అధికారులు తాగునీటి పంపిణీ విషయంలో ప్రతిరోజూ అధికారులతో చర్చించాలన్నారు. అనంతరం వాజేడు మండల పరిధిలోని పూసూరు గోదావరి వద్ద ఉన్న మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్‌ను పరిశీలించారు. ఇన్‌టేక్ వెల్ పనితీరు, మేడిగడ్డ ఎంత దూరంలో ఉందనే విషయాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి నీటి లభ్యత వివరాలపై ఆరా తీశారు. మ్యాపును పరిశీలించి తాగునీటికి సంబంధించిన పలు విషయాలను సేకరించారు. అదే విధంగా వెంకటాపురం(ఎం) మండల పరిధిలోని రామప్ప సరస్సులోని ఇన్‌టేక్ వెల్‌ను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, కృపాకర్‌రెడ్డి, ఎస్ఈ మల్లేశం, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ మాణిక్యరావు, డీసీవో సర్దార్‌సింగ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో శ్రీకాంత్ నాయుడు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సూచనలు చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ



వాజేడు: మ్యాపును పరిశీలిస్తూ..



రామప్ప సరస్సు పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

దేవతామూర్తుల ప్రతిమ అందజేత

ములుగు: ఇన్‌టేక్ వెల్‌ల పరిశీలన అనంతరం కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియాకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)పి.శ్రీజ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు మర్యాదపూర్వకంగా సమక్క, సారలమ్మ వనదేవతల ప్రతిమను అందజేశారు.

బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పాలి

భూపాలపల్లి అర్బన్: మతతత్వ విధానాలు అవలంభిస్తున్న బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని శ్రామిక భవనంలో బుధవారం జిల్లాలోని కార్మిక సంఘాలతో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక..

సీఐటీయూ జిల్లా నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బందు సాయిలు, ఉపాధ్యక్షులుగా కంపేటి రాజయ్య, జయప్రద, రాజబాబు, కార్యదర్శిగా చెన్నూరి రమేష్, సహాయ కార్యదర్శులు ఆకుదారి రమేష్, ఆడప సంతోష్, కోశాధికారిగా లక్ష్మితో పాటు జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జిల్లా పరిధిలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో ఎస్పీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన గ్రేవ్ కేసులను పరిశీలించారు. ఆయా కేసులకు సంబంధించి అధికారులు సేకరిస్తున్న ఆధారాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పాత నేరస్తులు, సమస్యాత్మక వ్యక్తులు, రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. మద్యం, నగదు అక్రమ రవాణాను నిరోధించడంలో భాగంగా చెక్‌పోస్టులలో విధులు నిర్వర్తించే సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. సరిహద్దు రాష్ట్రాల పోలీసు అధికారుల సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎవరైనా ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్తూ పట్టుబడితే, ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

క్లుప్తంగా

అమెరికాలో వీఎస్‌ఆర్ నగర్ వాసి మృతి

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న మహేష్
- ఆఫీస్‌లో డ్యూటీ చేస్తుండగానే గుండెపోటు


మహేష్ (ఫైల్)

బచ్చన్నపేట : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం వంగ సుదర్శన్‌రెడ్డినగర్ గ్రామానికి చెందిన చిట్టోజు మహేష్(34) అమెరికాలో గుండెపోటుతో బుధవారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. చిట్టోజు ప్రమీల, మదనాచారి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మహేష్ హైదరాబాద్‌లోని నాగారంలో స్థిరపడ్డాడు. మూడేళ్ల క్రితం ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన అతను జార్జియాలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం మహేష్ డ్యూటీలో ఉండగా గుండె పోటు రావడంతో తోటి ఉద్యోగులు ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. మహేష్‌కు భార్య రాధ, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. కాగా, మృతదేహం అమెరికా నుంచి ఇండియాకు రావడానికి ఐదు రోజుల సమయం పడుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

పోలీసు అధికారి ఫొటో డీపీ పెట్టి వసూళ్లకు యత్నం


హెల్ప్ కాల్ బేటా అని మేసేజ్ పంపిన సైబర్ నేరగాళ్లు

మహబూబాబాద్ రూరల్ : సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. మహబూబాబాద్ మండలం రేగడి తండా గ్రామానికి చెందిన ఓ యువకుడికి ఏకంగా ఓ పోలీసు ఉన్నతాధికారి ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టి తనకు డబ్బులు పంపాలని కోరాడు. అయితే దీనిపై అనుమానం వచ్చిన సదరు యువకుడు డబ్బులు పంపకుండా ఆ మెసేజ్ గురించి ఆరా తీసి మోసమని గ్రహించాడు. ఈ విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. కాగా, సైబర్ మోసాలపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆర్థికంగా నష్టపోకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

బడికి పోయినా బతికెటోడు..

రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి
- తండ్రికి తీవ్ర గాయాలు
- పెంబర్తి కాకతీయ కళాతోరణం సమీపంలో ఘటన
- శోకసంద్రంలో కుటుంబీకులు

పాపం.. ఆ చిన్నారి బడికి పోయినా బతికెటోడు. మాయదారి మృత్యువు మాటువేసి కాటువేసింది. పాఠశాలకు వెళ్లకుండా చిన్నారిని ఏమర్చి తండ్రితో వస్తాయని మారం చేయించింది. ఈ విషయంలో తండ్రితో కూడా సరేననిపించి చివరకు రోడ్డు ప్రమాద రూపంలో అమాంతం బలితీసుకుంది. ఫలితంగా ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగింది.


తమ్ముడు,చెల్లితో ఈశ్వర్. (సర్కిల్‌లో ఉన్న బాలుడు)


ఈశ్వర్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

జనగామ : ఎండు మిర్చిని విక్రయించేందుకు తండ్రితో కలిసి వెళ్లిన కొడుకు.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన జనగామ మండలం పెంబర్తి కాకతీయ కళాతోరణం సమీపంలో జరిగింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం రఘునాథపల్లి మండలం నక్కబొక్కలతండా శివారు సోమయ్యకుంట తండాకు చెందిన గుగులోత్ తిరుపతి, గంగా దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉంది. తిరుపతి తన సొంత ఆటోలో ఎండు మిర్చితో పాటు సీజనల్ వ్యాపారాలు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఊరూరా తిరిగి ఎండు మిర్చి విక్రయించేందుకు బయలుదేరగా.. పెద్ద కుమారుడు ఈశ్వర్ (07) తండ్రితో వెళ్తానని మారం చేయడంతో వెంట తీసుకెళ్లాడు. పటేల్ గూడెంలో ఎండు మిర్చి అమ్ముకుని... పెంబర్తి కాకతీయ కళాతోరణం సమీపంలో ఆలేరు వైపునకు యూటర్న్ చేసుకుంటున్న సమయంలో హైదరాబాద్ నుంచి వస్తున్న కారు.. ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో తండ్రితో కలిసి ముందు సీటులో కూర్చున్న ఈశ్వర్ అక్కడిక్కడే మృతి చెందగా.. తిరుపతికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అదే కారులో ఈశ్వర్‌తో పాటు తిరుపతిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి బాలుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించగా, తండ్రికి వైద్య పరీక్షలు చేశారు. కాగా, తమ కుమారుడు మృతి చెందాడని తెలియగానే తల్లిదండ్రులు కుప్ప కూలిపోయారు. కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రికి చేరుకోవడంతో రోదనలు మిన్నంటాయి. జిల్లా కేంద్రంలోని అరబిందో స్కూల్‌లో ఒకటో తరగతి చదువుకుంటున్న ఈశ్వర్.. బడికి వెళ్లినా బతికెటోడేమోనంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా .. 16 మందికి గాయాలు

- బుట్టాయిగూడెం వద్ద ఘటన
- ఏటూరునాగారం, ములుగు ఆస్పత్రులకు తరలింపు




క్షతగాత్రులు కావిరి ఎల్లక్క, సమ్మయ్య, బాబు,సూరక్కను ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

ఏటూరునాగారం/కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల పరిధి బుట్టాయిగూడెం మూలమలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడడంతో అందులోని మిర్చి కూలీలు గాయపడ్డారు. బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన 16 మంది కూలీలు సమీపాన ఉన్న మిర్చి తోటలో మిరప కాయలు ఏరడానికి ట్రాక్టర్‌లో వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో తమ గ్రామ సమీప మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. అందులోని కూలీలు రోడ్డు పక్కన ఉన్న లోయలో ఒకరిపై ఒకరు పడిపోవడంతో కాళ్లు, చేతులు విరిగిపోయాయి. కొంత మందికి తలలకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వారిని 108 అంబులెన్స్‌లో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో సూరికాని బక్కక్క, సునారికాని మైసక్క, కావిరి బైరేష్, సునారికాని ఆశయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ములుగు ఏరియా ఆస్పత్రికి పంపించినట్లు ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రి వైద్యులు తెలిపారు. గాయాలైన జనగాం ఎర్రక్క, కావిరి బక్కక్క, జనగాం సూరక్క, సునారికాని కుమ్మరి సమ్మయ్య, కావిరి ఎళ్లక్కల తోపాటు పలువురు ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

గేదెను తప్పించబోయి..

ఎదురెదురుగా ఢీకొన్న రెండు లారీలు
- డ్రైవర్ మృతి...మరో డ్రైవర్‌కు గాయాలు
- హసన్‌పర్తిలో ఘటన


బానోత్ మోహన్ (ఫైల్)


సంఘటన స్థలంలో లారీలు

హసన్‌పర్తి: గేదెను తప్పించబోయి రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఓ డ్రైవర్ మృతి చెందగా మరో డ్రైవర్ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరాడు. ఈ ప్రమాదం హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారి హసన్‌పర్తిలోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా మాటంపల్లికి చెందిన డ్రైవర్ బానోత్ మోహన్ సిమెంట్‌లోడ్ లారీతో మంగళవారం సూర్యాపేట నుంచి రామగుండం వైపునకు బయలుదేరాడు. బుధవారం తెల్లవారుజామున హసన్‌పర్తిలోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో రోడ్డుపై సేదదీరిన గేదెను తప్పించబోయి అదుపు తప్పి మంచిర్యాల నుంచి నల్లగొండ వైపునకు ఫ్లైయాష్ లోడ్‌తో వెళ్తున్న లారీని ఢీకొన్నాడు. ఈ ఘటనలో బానోత్ మోహన్ తల నుజ్జునుజ్జు అయి అందులోనే ప్రాణాలు వదిలాడు. ఫ్లైయాష్ లోడ్‌తో నల్లగొండ వైపునకు వెళ్తున్న మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన లారీడ్రైవర్ మనోహర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులను ఎంజీఎంకు తరలించారు. లారీలో చిక్కుకున్న మోహన్ మృతదేహాన్ని అతి కష్టం మీద బయటకు తీశారు.

పది గంటలు ట్రాఫిక్‌కు అంతరాయం

ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొనడంతో హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిలో హసన్‌పర్తి వద్ద ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. పది గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది.

అమరుల త్యాగ ఫలితమే పోడు వ్యవసాయం

- పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క


మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కొత్తగూడ: నేడు స్వేచ్ఛగా పోడు వ్యవసాయం చేసుకుంటున్నామంటే కుంజ రాము లాంటి ఎందరో అమరుల త్యాగ ఫలితమేనని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని మోకాళ్లపల్లిలో జరిగిన ఆదివాసీ లిబరేషన్ టైగర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు కుంజ రాము వర్ధంతి సభలో ఆమె మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలు, పేద, బడుగు, బలహీన వర్గాలు బతకడానికి ప్రధాన ఆధారం పోడు వ్యవసాయమే అని నమ్మిన ఎందరో విప్లవకారులు అసువులు బాశారన్నారు. వారి ఉద్యమాల ఫలితంగా అటవీ హక్కుల చట్టం, ఆదివాసీ ప్రత్యేక చట్టాలు వచ్చాయన్నారు. అలాంటి మహనీయులను స్మరించుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రశ్నించే గొంతులు కనుమరుగవుతున్నాయన్నారు. ఎక్కడ అన్యాయం జరిగినా నిలదీసేలా ప్రజల్లో చైతన్యం వచ్చినప్పుడే కుంజ రాము ఆశయం నెరవేరినట్లు అన్నారు. ఉద్యమాలు గుర్తించి అటవీ హక్కుల చట్టం, ఉపాధిహామీ చట్టాలను తీసుకుని వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలన్నారు. అంతకుముందు రాము స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం 'రణధీర' పుస్తకాన్ని ఆవిష్కరించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో సూర్య, కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్, సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు చంద్రన్న, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వర్‌రావు, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య, చందాలింగయ్య, తుడుందెబ్బ నాయకులు మైపతి అరుణ్‌కుమార్, వట్టం ఉపేందర్, బూర్క యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

గంగారం : కాంగ్రెస్‌తోనే దేశం అభివృద్ధి చెందుతుందని, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీని ఆదరించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం గంగారం మండలం కోమట్లగూడెంలోని కోదండరామాలయంలో కాంగ్రెస్ పార్టీ మానుకోట ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం కోమట్లగూడెం గ్రామంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధికరణ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గంగారం మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీలు ఈసం రమ సురేష్, విజయ రూప్‌సింగ్, కోదండరామాలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ సైపా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చెప్పుతో కొట్టుకున్న రైతు

- సాగునీరు అందక వరిపంట ఎండుతోందని..
- కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పు చేశానని ఆవేదన వ్యక్తం


ఎండిపోయిన వరిపంట


చెప్పుతో కొట్టుకుంటున్న రైతు వెన్నెల శ్యాం

భూపాలపల్లి: కష్టపడి సాగు చేసిన వరిపంట ఎండుతున్నదని ఓ రైతు తన చెప్పుతో తానే చెంపపై కొట్టుకుంటూ.. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తప్పు చేశానంటూ ఆవేదన వ్యక్తం చేసిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... రేగొండ మండలంలో ఎస్సారెస్పీ కెనాల్ నీరు రాక పలుచోట్ల వరి పంటలు ఎండుతున్నాయి. విషయం తెలుసుకున్న మాజీ శాసన సభాపతి సిరికొండ మధుసూదనాచారి బుధవారం సాయంత్రం 5 గంటలకు రేగొండ మండల కేంద్రం సమీపంలోని చెంచుపల్లికి వెళ్లే రహదారిలో ఎండిన పంట పొలాలను పరిశీలించి రైతులను పరామర్శించి వెళ్లిపోయారు. అనంతరం అక్కడే ఉన్న రైతు వెన్నెల శ్యాం.. స్థానికులు, మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి ఏటా మాదిరిగానే డీబీఎం 38 కెనాల్ కాలువ పక్కనే తన కున్న మూడెకరాల్లో వరి పంట సాగు చేశానని, ఇప్పటి వరకు సుమారు రూ. 75 వేల వరకు ఖర్చు అయిందని తెలిపాడు. వరి పొట్ట దశలో ఉండగా కెనాల్ నుంచి నీరు రాకపోవడంతో పూర్తిగా ఎండిపోయిందని వాపోయాడు. కాంగ్రెస్‌కు ఓటు వేయమని నేనే తిరిగిన.. నేను కూడా ఆ పార్టీకే ఓటు వేసి తప్పు చేశానంటూ తన చెప్పుతో తానే చెంపపై కొట్టుకున్నాడు. మార్పు అంటే ఇదేనా.. మార్పు కాదు.. మొత్తం ముంచే పాలన వచ్చిందంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. సాగునీరు అందించలేమని ముందే చెప్తే పంట వేసే వాడిని కాదని శ్యాం వాపోయాడు.

వృద్ధురాలి హత్య కేసుపై పోలీసుల ప్రత్యేక దృష్టి


విజయ (ఫైల్)

కాజీపేట : కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో గత సంవత్సరం డిసెంబర్ 14న జరిగిన వృద్ధురాలు కన్నె విజయ హత్య కేసుపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కేసు నానాటికీ సంక్లిష్టంగా మారుతున్న నేపథ్యంలో కాజీపేట ఏసీపీ తిరుమల్ రావు.. వృద్ధురాలి హత్య కేసు చేధించడానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా కొద్ది రోజుల నుంచి ఘటనా స్థలిని తరుచూ సందర్శిస్తూ హత్య పరిణామాలు, కాలనీ పరిసరాలను పరిశీలిస్తున్నారు. రహమత్ నగర్ కాలనీతో పాటు ప్రధాన రహదారులపై ఉన్న సీసీ కెమెరాలను జల్లెడ పడుతున్నారు. హత్య జరిగిన రోజు కాలనీకి రాకపోకలు సాగించిన వాహన యజమానుల జాబితాతో పాటు అనుమానితులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారణ చేస్తున్నారు. ఏసీపీ తిరుమల్ రావు పర్యవేక్షణలో సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సైలు లవన్‌కుమార్, శివకృష్ణ, సునీల్ కుమార్‌తో పాటు సిబ్బంది కేసును సవాల్‌గా తీసుకుని వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఏసీపీ తిరుమల్ రావు మంగళవారం రాత్రి దాదాపు 6 గంటల పాటు సిబ్బందికి దిశానిర్దేశం చేశారంటే కేసు పరిష్కారానికి పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో అర్థమవుతోంది.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య


రాజేశ్వరి(ఫైల్)

డోర్నకల్: కుటుంబ కలహాల నేపథ్యంలో సీరోలు మండలం మోదుగ్గడ్డతండాకు చెందిన ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. డోర్నకల్ ఎస్సై సంతోష్‌రావు కథనం ప్రకారం తండాకు చెందిన గుగులోత్ రాజేశ్వరి(33) ఐకేపీ వీవోఏగా విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి దంపతుల మధ్య గొడవ జరగగా క్షణికావేశంలో రాజేశ్వరి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వెన్నారంలో వ్యక్తి..

ఆర్థిక ఇబ్బందులతో మండలంలోని వెన్నారం గ్రామంలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన పాలబోయిన నాగేశ్వర్‌రావు(35) భవన నిర్మాణ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు డోర్నకల్ ఎస్సై తిరుపతి తెలిపారు.

తప్పుడు ప్రకటనలపై జాగ్రత్తగా ఉండాలి

- ఆయుష్ ఆర్‌డీటీ రవినాయక్


మాట్లాడుతున్న రవినాయక్

కాశిబుగ్గ: ఆయుర్వేదం గురించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలపై వైద్యులు, సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ రవి నాయక్ పేర్కొన్నారు. బుధవారం లేబర్‌కాలనీలోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో ఫ్యాకల్టీ, వైద్యులు, సిబ్బందికి 'ఫార్మకోవిజిలెన్స్' పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం పట్ల ప్రజలకు నమ్మకం ఎక్కువ అవుతున్న ఈ రోజుల్లో అనేక ఆయుర్వేద కంపెనీలు వివిధ మందుల రూపంలో తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తున్నాయన్నారు. దీనిపై వైద్యులు, సిబ్బంది ఎప్పటికప్పుడూ అప్రమత్తంగా ఉంటూ వాటిపై ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్, హాస్పిటల్ సూపరింటెండెంట్ పద్మావతి, అకడమిక్ అధికారి వాసంతి, ప్రొఫెసర్లు రవీందర్‌గౌడ్, రమేష్‌బాబు, సిరాజుద్దీన్, సులోచన, దుర్గాబాయి, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- ఆర్పీఎఫ్ పీసీఎస్‌సీ అరోమాసింగ్ ఠాకూర్


మాట్లాడుతున్న అరోమాసింగ్ ఠాకూర్

కాజీపేట రూరల్/కాశిబుగ్గ : రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) పోలీస్ సిబ్బంది, అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్(పీసీఎస్‌సీ) అరోమాసింగ్ ఠాకూర్ అన్నారు. కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీస్‌స్టేషన్ తనిఖీ నిమిత్తం బుధవారం వచ్చిన అరోమాసింగ్‌ఠాకూర్‌కు స్థానిక ఆర్పీఎఫ్ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం కాజీపేట రైల్వే వీఐపీ లాంజ్‌లో నిర్వహించిన సురక్ష సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు, అధికారులు ప్రయాణికుల విషయంలో మర్యాదగా ఉండడంతోపాటు వారికి భద్రత కల్పించాలన్నారు. క్రైమ్ రేట్ తగ్గించాలని పేర్కొన్న ఆమె విధుల విషయంలో పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం అరోమాసింగ్‌ఠాకూర్ కాజీపేట ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి క్రైమ్ రేట్, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ డాల్ బెహర, కాజీపేట ఆర్‌పీఎఫ్ సీఐ ఎం.సంజీవరావు, వరంగల్ సీఐ కృష్ణ, కాజీపేట ఎస్సై రాజన్న పాల్గొన్నారు.

వరంగల్ ఆర్‌పీఎఫ్ స్టేషన్ తనిఖీ..

వరంగల్ రైల్వే స్టేషన్‌లోని రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) స్టేషన్‌ను అరోమా సింగ్ ఠాకూర్ తనిఖీ చేశారు. రైల్వే స్టేషన్ మొత్తం కలియ తిరుగుతూ భద్రతా చర్యలు పరిశీలించారు. అలాగే స్టేషన్‌లోని రికార్డులు, క్రైమ్ వివరాలు, సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. రైళ్లో గంజాయి, నిషేధిత, అలాగే ఫైర్‌కు సంబంధించిన వస్తువులు తరలించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఆర్‌పీఎఫ్ డీఎస్పీ ప్రఫుల్‌కుమార్ దల్బెరా, సీఐ టీఎస్‌ఆర్.కృష్ణ ఉన్నారు.

రామప్పను సందర్శించిన అరోమాసింగ్ ఠాకూర్

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలంలోని రామప్ప దేవాలయాన్ని పీసీఎస్‌సీ అరోమా సింగ్ ఠాకూర్ సందర్శించారు. రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించిన అనంతరం ఆమెకు ఆలయ పూజారి ఉమాశంకర్ తీర్థప్రసాదాలు అందించి శాలువాతో సత్కరించారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించగా రామప్ప శిల్పాకళాసంపద అద్భుతంగా ఉందని అరోమాసింగ్‌ఠాకూర్ అన్నారు.

ప్రగతి పథంలో వరంగల్ డీసీసీబీ

- చైర్మన్ మార్నేని రవీందర్ రావు


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

హన్మకొండ: వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) ప్రగతి పథంలో దూసుకెళ్తోందని ఆ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో మహాజన సభ జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ రూ.860 కోట్లు ఉన్న డీసీసీబీ టర్నోవర్ రూ.1893 కోట్లకు చేరుకుందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.12 కోట్ల లాభం సాధించామని, ఈ ఆర్థిక సంవత్సరంలో మరింత లాభం పెరుగుతుందన్నారు. దేశంలోనే అత్యధికంగా రూ.350 కోట్ల రుణాలు ఇచ్చి జాతీయ స్థాయి అవార్డు పొందినట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 70వ ప్రాథమిక సహకార సంఘాలుండగా 50 సంఘాలకు వరంగల్ డీసీసీబీ ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. మిగతా 20 సంఘాలకు వాణిజ్య బ్యాంకులు అందిస్తాయన్నారు. డీసీసీబీ సాయంతో నడుస్తున్న 50 సంఘాలను మల్టీ సర్వీస్ సెంటర్లుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. డీసీసీబీలో డిపాజిట్లు రూ.503 కోట్లకు చేరాయన్నారు. స్వయం సహాయక సంఘాలకు రూ.100 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. మహాజన సభలో సీఈఓ మహమ్మద్ వజీర్ సుల్తాన్, జీఎం శ్రీధర్, జిల్లా సహకార అధికారులు జి.నాగేశ్వర్ రావు, ఎస్.వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు మాడుగుల రమేష్, నాయిని రంజిత్, దొంగల రమేష్, చెట్టుపల్లి మురళి, నరసింహారావు, ఎర్రబెల్లి గోపాలరావు, కేశిరెడ్డి ఉపేందర్ రెడ్డి, ఎ.రాజేశ్వర్ రెడ్డి, చాపల యాదగిరి రెడ్డి, కక్కిరాల హరిప్రసాద్, పోలేపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమే కీలకం

- హైదరాబాద్ వర్సిటీ ప్రొఫెసర్ శ్రీవాస్తవ


మాట్లాడుతున్న ప్రొఫెసర్ చేతన్‌శ్రీవాస్తవ

కేయూ క్యాంపస్: మానవాభివృద్ధిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలకంగా మారిందని, ప్రపంచీకరణ నేపథ్యంలో ఆధునిక సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోందని హైదరాబాద్ యూనివర్సిటీ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కళాశాలలోని కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'ఫినిటిక్ రెవల్యూయేషన్ రీషేపింగ్ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇన్‌ది డిజిటల్ ఏజ్' అనే అంశంపై రెండు రోజులు నిర్వహించే జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఫినెక్టివ్ విప్లవం రూపాంతరం చెందిందన్నారు. ఆర్థిక సేవలు పూర్తిగా డిజిటలైజేషన్ అయ్యాయన్నారు. వరంగల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ డైరెక్టర్ కశ్యప్‌నరేష్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేలా ముందుకెళ్తున్నారన్నారు. ఓయూ ప్రొఫెసర్ నరేష్ మాట్లాడుతూ ఒకప్పుడు బ్యాంకులు తమ సేవలను మాన్యువల్ విధానంలో కొనసాగించేవని, ప్రస్తుతం డిజిటల్ విధానంలో అందిస్తున్నాయన్నారు. కేయూ కామర్స్ అండ్‌బిజినెస్‌మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి అమరవేణి మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కంప్యూటర్‌తో ముడిపడి ఉందన్నారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ జ్యోతి మాట్లాడుతూ ప్రపంచీకరణ ,సరళీకరణ విధానాలతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం కొనసాగుతోందని, ఇది ఆధునిక సాంకేతికపరిజ్ఞానంతో సాధ్యమైందన్నారు. ఈసదస్సులో సెమినార్ డైరెక్టర్ డాక్టర్ మాదాసి కనకయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి వరలక్ష్మి, ప్రొఫెసర్ కె రాజేందర్,డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్ ఆర్ ఆదిరెడ్డి, హరికుమార్ , తదితరులు పాల్గొన్నారు.